4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శుక్రవారం 11 ఏప్రిల్ 2025
www.ntnews.com



నేడు పూలే జయంతి

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

## తహవ్వూర్ రాణా అప్పగింత

**26/11** ముంబై ఉగ్రదాడి కేసులో కీలక నిందితుడు తహవ్వూర్ హుస్సేన్ రాణా ఎట్టకేలకు అమెరికా జైలును వీడి భారతీయ దర్యాప్తు విభాగాల కస్టడీకి చేరాడు. తనను భారత్‌కు అమెరికా అప్పగించకుండా ఉండేందుకు రాణా చేయని ప్రయత్నమంటూ లేదు. అవకాశమున్న అన్ని ప్రక్రియలను వాడుకొని భారత్‌ను ముప్పుతిప్పలు పెట్టాడు. చివరగా రాణా వేసిన రెండు దరఖాస్తులు అమెరికా ఫెడరల్ కోర్టులో వీగిపోవడంతో అన్ని దారులు మూసుకుపోయాయి. ముంబై ఉగ్రదాడి సహ కుట్రదారుడైన డేవిడ్ కోల్‌మన్ హెడ్లీకి దాడి ప్రదేశాల గురించిన సమాచారం సేకరించి పెట్టేందుకు పాక్ సంతతికి చెందిన రాణా రెక్కీ నిర్వహించాడనేది ప్రధాన ఆరోపణ.

రాణాను భారత్‌కు రప్పించిన ఘనత తమదేనని బీజేపీ అంటుంటే, తాము 2011 నుంచి జరిపిన కృషి ఫలితంగానే అతడిని అమెరికా అప్పగించిందని కాంగ్రెస్ చెప్పుకొంటున్నది. అప్పగింత ప్రక్రియ మన్మోహన్ నేతృత్వంలోని యూపీఏ హయాంలో మొదలైతే, మోదీ నేతృత్వంలోని ఎన్డీయే హయాంలో కొలిక్కివచ్చింది. ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా రాణా అప్పగింతకు ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ ఆమోదముద్ర వేశారు. ఎవరికి ఎంత పేరు రావాలనేది పక్కనపెడితే రాణా అప్పగింత కేవలం ప్రతీకాత్మక విజయమేనని చెప్పాలి. వాస్తవికంగా ముంబై దాడుల కేసులో సాధించే ముందంజ అంతంతమాత్రమేనని చెప్పక తప్పదు. ఇదివరకే అమెరికాకు రాసిచ్చిన హామీపత్రంలో రాణా విచారణకు సంబంధించి పలు కఠినమైన షరతులకు భారత్ అంగీకరించింది. జైలులో భద్రత కల్పిస్తామని, కస్టడీలో చిత్రహింసలకు గురిచేయబోమని, అప్పగింత లేఖలో ప్రస్తావించిన నేరాలపైనే విచారణ పరిమితం చేస్తామని హామీ ఇచ్చింది. అంటే వేరే కేసులకు సంబంధించిన ఆధారాలు బయటపడినా చేయగలిగేదేమీ ఉండదన్న మాట. సబబైన రీతిలో విచారణ జరపాలనేది మరో షరతు. ఇంకా 1997 భారత్-అమెరికా నేరస్థుల అప్పగింత ఒప్పందం మేరకు భారత్‌లోని చట్టాలు, అంతర్జాతీయ ప్రమాణాలూ కచ్చితంగా పాటించాల్సిందే. ఈ కారణంగా రాణాను కొందరు విపక్ష నేతలు 'బిర్యానీ ఖైదీ'గా అభివర్ణించడం గమనార్హం.

భారత్ చేతికి రాణా చిక్కడం నాణేనికి ఒకవైపు మాత్రమే. మరోవైపు మరో నిందితుడు డేవిడ్ కోల్‌మన్ హెడ్లీ విషయంలో భారత్ ప్రయత్నాలు ఏ మాత్రం ముందుకు సాగలేదనేది కాదనలేని వాస్తవం. నిజానికి ముంబై దాడుల కేసులో రాణాను విచారించడం ఎంత ముఖ్యమో, హెడ్లీని విచారించడం అంతకన్నా ముఖ్యం. కానీ, అమెరికా అతడిని ఇండియాకు అప్పగించడమనేది అసాధ్యమని తెలియవస్తున్నది. 2010లో అమెరికా ప్రభుత్వంతో కుదుర్చుకున్న నేర అంగీకార పత్రమే అందుకు అడ్డుగా నిలుస్తున్నది. 'చట్టపరమైన, దౌత్యపరమైన, వ్యూహాత్మక కారణాల వల్ల' అమెరికా హెడ్లీ అప్పగింతకు ఎన్నటికీ అంగీకరించదనేది స్పష్టం. కీలక గూఢచార రహస్యాలు తెలిసిన హెడ్లీ వంటి వారిని అమెరికా ఎన్నటికీ అప్పగించదని తేలిపోయింది. ఈ క్రమంలో ముంబై దాడి కేసులో న్యాయం జరిపేందుకు భారత్ జరిపే ప్రయత్నాలకు గండిపడినా అమెరికా పట్టించుకోదన్న మాట. అందువల్లనే రాణా అప్పగింతను పాక్షిక విజయంగానే చూడాలి.

# రాహుల్‌కు రేవంత్ తలపోటు



**బుద్ధా మురళి**

**హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరించిన తీరు జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీని కోలుకొని విధంగా దెబ్బకొట్టింది. సాధారణంగా కాంగ్రెస్ నాయకత్వానికి దేశ స్థాయిలో నష్టం కలిగించే అంశంలో ఉద్యమించడానికి బీజేపీ ముందు వరుసలో నిలవాలి, నిలుస్తుంది కూడా. కానీ, ఈ వ్యవహారంలో రాష్ట్రంలో బీజేపీ అంటీముట్టనట్టుగా వ్యవహరించినా దేశవ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన స్పందన కాంగ్రెస్ పరువు తీసింది.**

రాష్ట్రంలో బీజేపీ నాయకులు అంటీముట్టనట్టు వ్యవహరిస్తే.. జాతీయ నాయకులు మాత్రం వన్యప్రాణులను రక్షించాలని ఢిల్లీలో భారీగా పోస్టర్లతో ప్రచారం చేశారు. యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల అడవిలో జింకలు, దుప్పులు, నెమళ్లు వంటి అనేక వన్యప్రాణులు ఉన్నాయి. ఇది వాస్తవం. 'అక్కడ వన్యప్రాణులు లేవు, అసలు చెట్లే లేవు..' అన్నట్టుగా కాంగ్రెస్ నాయకత్వం సాగించిన ప్రచారం ఆ పార్టీని నవ్వులపాలు అయ్యేట్టు చేసింది. పార్టీలవారీగా రాష్ట్రంలో మీడియా చీలిపోవడం వల్ల ఇప్పటివరకు ఇక్కడి తెలుగు మీడియా.. ప్రభుత్వం సాగించిన అనుకూల ప్రచారానికి తగ్గట్టు వ్యవహరించింది. కానీ, యూనివర్సిటీ భూములను కాపాడాలని, వన్యప్రాణులను రక్షించాలని దేశవ్యాప్తంగా మీడియా, సామాజిక మాధ్యమాలు, సెలబ్రిటీలు, బాలీవుడ్ నటీనటులు గళమెత్తారు. ఈ ప్రచారంపై ఎదురుదాడి చేసేందుకు 'అదంతా ఏఐ సృష్టి, అక్కడ వన్యప్రాణులు లేవు, కేసులు పెడతా'మని మీడియాలో అధికార వర్గం వార్తలు రాయించింది. జాన్ అబ్రహాం, దియా మీర్జా, ధృవ్ రాఠీ వంటి వారిపై కేసులు పెడతామని వార్తలు రాయించినా, వాళ్లు భయపడలేదు. అక్కడ ఉన్న 400 ఎకరాల భూమిని అమ్ముకోవాలని ప్రభుత్వం ప్రయత్నించింది నిజం. ఆ భూముల్లో వన్యప్రాణులు ఉన్నది నిజం, రాత్రికిరాత్రే భారీఎత్తున బుల్డోజర్లను పంపించి, వేలాది చెట్లను నేలకూల్చింది నిజం. బుల్డోజర్లతో రాత్రివేళ చెట్లను నేలమట్టం చేస్తుంటే నెమళ్లు, దుప్పులు, జింకలు, పశుపక్షాదులు హాహాకారాలు చేసింది నిజం. వీటిని విద్యార్థులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలిసేట్టు చేసింది నిజం. విద్యార్థులే కనుక ఈ పని చేయకపోతే బయటి వారికి తెలిసేదే కాదు. పైగా ప్రభుత్వం అక్కడో భూతల స్వర్గాన్ని నిర్మించనుందని మీడియా ప్రచారం చేసేది. ప్రచారంలో ఏఐని వాడుకున్నారేమో కానీ అడవిని, అడవి జంతువులను మాయం చేయాలని చూసింది, భూమి అమ్ముకోవాలని చూసింది నిజం కాదా?

కేవలం నాలుగైదు రోజుల విద్యార్థుల ఉద్యమం దేశవ్యాప్తంగా కదలిక తీసుకువచ్చింది. కోర్టుకు వరుసగా మూడు రోజుల సెలవులు రావడంతో ఎవరూ గడప ఎక్కకముందే అడవిని మైదానంగా మార్చేందుకు పెద్దఎత్తున బుల్డోజర్లను రంగంలోకి దింపారు. దాదాపు వంద ఎకరాల్లో అడవిని చదును చేశారు. సుప్రీంకోర్టు స్టే విధించడంతో ఒక రకంగా తీవ్ర సమస్యల్లో చిక్కుకోకుండా బయట పడింది.



> చెల్లాచెదురైన అటవీ ప్రాణులు, వాటి ఆర్తనాదాలు దేశవ్యాప్తంగా కదలిక తెచ్చాయి. ముంబైలోని సెలబ్రిటీలు, ఢిల్లీలోని సుప్రీం కోర్టు అంత సీరియస్‌గా స్పందించడానికి కారణం ఆయా ప్రాంతాల్లో అటవీ సంపద మాయమైతే వాతావరణం ఎలా ఉంటుందో వాళ్లు స్వయంగా చూశారు. వాతావరణ కాలుష్యం వల్ల ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు మూసివేయడాన్ని, వాహనాల్లో ప్రయాణాలు నిషేధించడాన్ని ఢిల్లీ చూసింది. అందుకే అలాంటి పరిస్థితి హైదరాబాద్‌కు రావద్దని స్పందించింది.

'భూములు తెగనమ్ముకుంటే మనకూ, మనవారికి ఎంతో కొంత దక్కకపోతుందా?' అని ఆశలు పెట్టుకొన్నవారికి సుప్రీంకోర్టు స్పందన దుందుడుకు చర్యగా అనిపించవచ్చు. ఒకవేళ సుప్రీంకోర్టు స్టే విధించి ఉండకపోతే దేశవ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలకు విద్యార్థుల ఉద్యమం పాకి ఉండేది.

దేశంలో రోజుకు సగటున 86 లైంగికదాడి కేసులు నమోదవుతున్నాయి. గంటకు నాలుగు లైంగికదాడుల కేసులు నమోదవుతున్న దేశంలో ఢిల్లీలో జరిగిన నిర్భయ కేసు దేశాన్ని కుదిపేసింది. ఒక్కో వాతావరణంలో, ఒక్కో సంఘటనపై అనేక కారణాలతో దేశం తీవ్రంగా స్పందిస్తుంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు, వన్యప్రాణుల విషయంలోనూ అంత తీవ్రస్థాయి ఉద్యమానికి వాతావరణం అంతా సిద్ధం అయిన తరుణంలో సుప్రీంకోర్టు స్టే విధించడంతో కాంగ్రెస్ బతికిపోయింది. భూములు అమ్ముకుంటూ అక్కడ వన్యప్రాణులు లేవని, గుంటనక్కలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన బాధ్యతారహితమైన వ్యాఖ్యలు విద్యార్థుల ఉద్యమానికి ఆజ్యం పోశాయి. అన్ని చోట్ల బూతులతోనే నెట్టుకు వస్తానను కున్న ఆయన ఆలోచనలకు తాము అడవిని రక్షించేందుకు గుంట నక్కలమే కానీ, అడవిని దోచుకునే పందికొక్కులం కాదని విద్యార్థులు బదులిచ్చారు.

గతంలో తెలంగాణలో పర్యటించిన రాహుల్ గాంధీ అదే యూనివర్సిటీలో విద్యార్థులతో మాట్లాడుతూ 'మీరు ఏ సమస్యపై పిలిచినా పది నిమిషాల్లో వాలిపోతాను' అని హామీ ఇచ్చారు. అటవీ భూమి అమ్ముకొనే వ్యవహారంలో విద్యార్థులు ఉద్యమిస్తూ రాహుల్‌గాంధీకి విన్నవించుకున్నా స్పందన లేదు. ఈ భూముల వ్యవహారంలో ఇప్పటివరకు బహిరంగంగా ఆయన మాట్లాడలేదు. అయితే దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు ఈ వ్యవహారం మెడకు చుట్టుకున్నది. కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ ఏకంగా సచివాలయంలో మంత్రులతో ఈ భూముల గురించి సమావేశమయ్యారు. మంత్రులకు ఆదేశాలు ఇచ్చారు. విద్యార్థులపై కేసులు ఎత్తేసేలా చేశారు. ఇదంతా అధిష్ఠానం చెప్పకుండానే పార్టీ ఇంచార్జ్ స్వతంత్ర నిర్ణయాలని చెప్పలేం. వివిధ రాష్ర్టాల్లో అదానీకి భూములు కట్టబెట్టడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్న రాహుల్‌గాంధీ.. ముందు హైదరాబాద్ యూనివర్సిటీ భూములపై సమాధానం చెప్పాల్సిన పరిస్థితి తలెత్తింది. రాహుల్ గాంధీ దేశంలో ఎక్కడికి వెళ్లినా హైదరాబాద్ భూములు, వన్యప్రాణులు ఆయన్ని వెంటాడుతాయి. ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి.

అధిష్ఠానం వద్ద రేవంత్‌రెడ్డి మాట ఎంతవరకు చెల్లుబాటు అవుతుందో పాలనను చూస్తే అర్థమవుతుంది. రేవంత్‌రెడ్డి సీఎం కాగానే టీడీపీలో తన సహచరులు వేం నరేందర్‌రెడ్డి, సీతక్క, శోభా, సూర్యాపేట రజనీలకు పదవులు ఇచ్చారు. ఆ తర్వాత శాసనమండలి ఎన్నికల నుంచి ఇప్పటి వరకు తన మాట చెల్లుబాటు కాలేదు. మంత్రివర్గ విస్తరణ అంటూ గత 15 నెలల నుంచి మీడియాలో వార్తలు తప్ప, అధిష్ఠానం అనుమతి లేదు .రేవంత్‌రెడ్డి నిర్ణయాలు రాహుల్‌గాంధీకి గుదిబండగా మారినా ఆయనను తప్పించలేరు, సొంతంగా నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఇవ్వరు అన్నట్టుగా అధిష్ఠానం, రేవంత్ రెడ్డి మధ్య రాజకీయ దోబూచులాట సాగుతున్నది. ■



# సర్కారు గొడ్డలికి దండగలు వేయరా?



**వాణీదేవి**

**బేగంపేటలోని స్వామి రామానంద తీర్థ అంటేనే ప్రకృతితో మమేకమైన సంస్థ. వనాలను కంటికి రెప్పలా చూసుకునే సంస్థ అది. ఔషధ మొక్కల ప్రాముఖ్యతపై ప్రచారం చేసే బాధ్యతనూ నెత్తిన పెట్టుకుంది. అలాంటి సంస్థకు చైర్‌పర్సన్‌గా నేను బాధ్యతలు నిర్వర్తిస్తున్నా. ఇప్పుడు అంశం ఆ సంస్థ గురించి కాదు, ఆ సంస్థలో కొన్నేండ్ల క్రితం జరిగిన ఓ ఘటన గురించి, కంచ గచ్చిబౌలి చుట్టూ అలుముకుంటున్న వివాదం గురించి, ప్రకృతిపై గొడ్డలి వేటు గురించి.**

కొన్నేండ్ల క్రితం వరద బీభత్సంతో దాదాపు హైదరాబాద్ నగరం నీట మునిగిపోయింది. స్వామి రామానందతీర్థను సైతం వరద ముంచెత్తింది. ఆ ప్రభావంతో ఐదారు దశాబ్దాల నాటి రెండు చెట్ల కొమ్మలు నేలకొరగడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. దీంతో సిబ్బంది ఆ కొమ్మలను తొలగించారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. ఆ కొమ్మలను తొలగించిన పాపానికి ఆగమేఘాలపై అర్బన్ ఫారెస్ట్ విభాగం కదిలివచ్చింది. 'మీరు చెట్లను నరికివేశారు' అంటూ కేసు నమోదు చేసింది. మల్లారెడ్డి అనే ఉద్యోగిని కార్యాలయానికి తీసుకెళ్లి రోజంతా కూర్చోబెట్టారు. ఆ తర్వాత విషయం తెలిసి నేను అధికారులతో మాట్లాడాక గానీ, వారికి నిజం తెలియలేదు. సంస్థ చేస్తున్న కార్యకలాపాల గురించి, ప్రకృతి పరిరక్షణ గురించి తెలుసుకొని అధికారులు నాలుక్కరుచుకున్నారు. అయితే, 'మేడం.. కేసు నమోదైంది కదా, ఇప్పుడు ఏమీ చేయలేం. రూ.25 వేలు జరిమానా చెల్లించండి' అని చెప్పడంతో చేసేదేమీ లేక ఆ మొత్తాన్ని చెల్లించాల్సి వచ్చింది. రెండు కొమ్మలను నరికితే ఏకంగా చెట్లనే నరికివేశారంటూ అర్బన్ ఫారెస్టు అధికారులు తీసుకున్న చర్యలు ఇవి. అందులోనూ హైదరాబాద్ స్టేట్ విమోచనం కోసం పోరాడిన స్వామి రామానందతీర్థ, ఆయన శిష్యుడు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు నెలకొల్పిన భవన ప్రాంగణం అని కూడా ఆలోచించకుండా చర్యలకు దిగారు.

నిజానిజాలను పక్కనబెడితే చెట్లు నరికారన్న విషయం తెలుసుకొని ఆ అధికారులు స్పందించిన తీరు నిజంగా శభాష్ అనాల్సిందే. మరి ఇప్పుడు కంచ గచ్చిబౌలి పరిస్థితి ఏమిటి? నగరానికి ఆక్సిజన్ అందిస్తున్న వేల చెట్ల పరిస్థితి ఏమిటి? ఎకో పార్కు అంటూ సర్కారు చేసే కుట్రలో 400 ఎకరాల్లో జంతుజాలం, వృక్షజాతుల మనుగడ ఏమిటి? అన్నది ప్రశ్నార్థకం. భవిష్యత్తులో మానవ మనుగడకు 'ఆయువు'పట్టుగా ఉన్న వృక్షసంపదను హరింపజేసేందుకు సిద్ధమవుతున్న సర్కారును ఏమనాలి? స్థలం ప్రభుత్వానిదా.. లేక హెచ్‌సీయూదా? అని అడగడం లేదు. కానీ, 400 ఎకరాల అడవిని రియల్ ఎస్టేట్ వ్యాపారి అవతారమెత్తి వేలం వేయడం ద్వారా అటవీ సంపద నాశనం కాదా? ప్రకృతి అంటే జీవన విధానం. అలాంటి ప్రకృతిని నాశనం చేసేలా కంచ అడవులను వేలం వేయడం అంటే కూర్చున్న కొమ్మను నరుక్కోవడమే.

ఒకవైపు జనాభా పెరుగుతున్నది.అర్బనైజేషనూ విస్తరిస్తున్నది. ఈ నేపథ్యంలో మనిషి మనుగడకు ఏ మేరకు ఆక్సిజన్ అవసరమో గుర్తించాలి. ఆ మేరకు ఉన్న వృక్ష సంపదను కాపాడుకుంటూ మరింతగా మొక్కలు నాటే కార్యక్రమం ఒక ఉద్యమంలా కొనసాగించాల్సిన తరుణంలో ఉన్న ప్రకృతిపై వేటు వేయడం సరైనదా అన్నది పర్యావరణవేత్తలు, మేధావులు ఆలోచన చేయాలి. గళం విప్పాలి. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హరిత హారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టి దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో రికార్డు స్థాయిలో పచ్చదనాన్ని పెంచినట్టు జాతీయ సంస్థల నివేదికలే స్పష్టం చేశాయి. పెరుగుతున్న ప్రజావసరాలకు అనుగుణంగా ఒక బాధ్యతగా పచ్చదనాన్ని పెంచాల్సిన ప్రస్తుత సర్కారు ఇప్పుడు అటవీ సంపదపై వేటు వేయడం ఏ మాత్రం హర్షదాయకం కాదు.

(వ్యాసకర్త: శాసనమండలి సభ్యురాలు)


## జీఎస్టీ పంపిణీలో వివక్ష

ఏ ఫెడరల్ వ్యవస్థలోనైనా పన్నుల ఆదాయ పంపిణీ వ్యవస్థ ఎంతో కీలకం. ఇది ఆర్థిక సమతుల్యతను కల్పించడమే కాకుండా ప్రాంతాల మధ్య సమాన అభివృద్ధిని సాధించడంలో సహాయపడుతుంది. అయితే భారత్‌లో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) ద్వారా అత్యధికంగా ఆదాయం సమకూర్చే రాష్ర్టాలకు ఎక్కువ వాటా లభించకపోవడం గమనార్హం. జీఎస్టీ ఆదాయ పంపిణీ మోడల్ రూపకల్పనలో అన్ని రాష్ర్టాల ఆర్థిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని తక్కువ అభివృద్ధి చెందిన రాష్ర్టాలకు ఎక్కువ ఆర్థిక సహాయం అందించే పద్ధతిని రూపొందించారు.

జీఎస్టీ వసూలు, పంపిణీ డేటా ప్రకారం మహారాష్ట్ర ప్రతి సంవత్సరం 35 నుంచి 45 శాతం వరకు మొత్తం వసూలులో కీలకపాత్ర పోషిస్తోంది. గుజరాత్, కర్ణాటక, తమిళనాడు, హర్యానా వంటి రాష్ర్టాలు కూడా జీఎస్టీ వసూళ్లు పెరుగుతున్న రాష్ర్టాలుగా నిలిచాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో (జనవరి వరకు) మహారాష్ట్ర రూ.2,97,685 కోట్లను జీఎస్టీ ద్వారా సమకూర్చింది. కర్ణాటక రూ.1,31,949 కోట్లతో రెండో స్థానంలో నిలిచింది. గుజరాత్ రూ.1,13,252 కోట్లు, తమిళనాడు రూ.1,08,626 కోట్లతో వరుసగా ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. కొన్ని రాష్ర్టాలు పారిశ్రామికాభివృద్ధి, వినియోగ స్థాయిలు, జనాభా ఆధారంగా ఎక్కువ పన్నులు వసూలు చేయగలుగుతున్నా, తక్కువ అభివృద్ధి చెందిన రాష్ర్టాలకు అధికంగా నిధులు అందించడమే లక్ష్యంగా జీఎస్టీ ఆదాయ పంపిణీ విధానాన్ని రూపొందించారు. దీంతో, జాతీయ పన్ను వసూళ్లలో ఎక్కువ వాటా ఉన్న రాష్ర్టాలకు తక్కువ నిధులు అందుతున్నాయి.

ఉత్తరప్రదేశ్ జీఎస్టీ రిటర్న్స్ రూపంలో ఎక్కువ మొత్తంలో నిధులు పొందుతున్న రాష్ర్టాల జాబితాలో ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో (జనవరి వరకు) జీఎస్టీ వసూళ్లకు రూ.93,100 కోట్లు ఇచ్చి, తిరిగి రూ.60,572 కోట్లు పొందింది. పశ్చిమబెంగాల్ రూ.55,268 కోట్లు వసూలు చేసి, రూ.35,884 కోట్లు తిరిగి పొందింది. ఈ నేపథ్యంలోనే జీఎస్టీ వ్యవస్థపై అనేక రాష్ర్టాలు విమర్శలు చేస్తున్నాయి. ముఖ్యంగా ఆదాయ పంపిణీ మోడల్, పరిహార విధానం, వాటి ఆర్థిక పరిస్థితులపై దీని ప్రభావాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పలు రాష్ర్టాల ముఖ్యమంత్రులు తమ నిరసన గళం విప్పుతున్నారు. రాష్ర్టాలకు జీఎస్టీ పంపిణీలో అసమానత ఉందని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆరోపించారు. రాష్ర్టాలకు పన్నుల ఆదాయంలో 50 శాతం వాటా ఇవ్వాలని కేరళ సీఎం పినరాయి విజయన్ కోరారు. జీఎస్టీ అమలైన తర్వాత పంజాబ్‌కు ఆదాయ వృద్ధిలో భారీగా కోత పడిందని పంజాబ్ ఆర్థిక మంత్రి హర్‌పాల్ సింగ్ చీమా ఆందోళన వ్యక్తంచేశారు.

**- జినిత్ పర్మార్,** ('అవుట్‌లుక్' సౌజన్యంతో)



చెట్టు
దాని కొమ్మన పిట్ట
నీడన జింక
పక్కన పురి విప్పిన నెమలి
అన్నీ అబద్ధాలే

ఎక్కడుంటాయవి
ఏఐలో తప్ప

గొడ్డలి
బుల్డోజర్
చేతిన గన్నో.. పెన్నో
అన్నీ నిజాలే...

ఏఐతో ఏం పని
ఎక్కడైనా ఉంటాయి

**సజా...సొమ్మ్యం!**



**మడిపల్లి రాజ్‌కుమార్**
99496 99215

# బీజేపీ.. కాంగ్రెస్.. కులతంత్రం



**మ్యాకం రవికుమార్**
94929 10065

**కేవలం భారతీయ సమాజానికే పరిమితమైన విశిష్ట లక్షణం కులం. పుట్టుకకు ముందే నిర్ణయమై, పుడమిలో కలిసినా మారనిది కులమే. ఒకప్పుడు సమాజ పురోభివృద్ధికి అది వెన్నెముక. కానీ, యాంత్రిక విప్లవం ఆరంభంతో కులవృత్తుల ప్రాభవం మసకబారడం మొదలైంది. కార్పొరేట్ శక్తుల రంగప్రవేశంతో అణగారిన వర్గాలు మరింతగా అణచివేయబడుతుండగా, ఆధిపత్యవర్గాలు సంపదను పోగుచేసుకుంటూ మరింత బలపడుతున్నాయి. ఈ వైరుధ్యమే ప్రస్తుత కులగణన డిమాండ్‌కు మూలకారణం.**

కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రిజర్వేషన్ ఫలాలు, విద్యా, ఉపాధి అవకాశాలు ఓబీసీల్లో ప్రాబల్యం పొందిన వర్గాలకే అధిక భాగం చెందుతున్నాయనేది చేదు వాస్తవం. ఫలితంగానే ఇతర ఓబీసీ వర్గాలు గళం విప్పుతున్నాయి. జనాభా ప్రాతిపదికన సంపదలో వాటాలను పంచమంటున్నాయి. తెలంగాణలో విద్యా, ఉపాధి, ఉద్యోగాలు, స్థానికసంస్థల్లో ఓబీసీలకు అమలు చేస్తున్న రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ప్రవేశపెట్టిన బిల్లుకు అసెంబ్లీ ఆమోదంతో మళ్లీ రగడ రాజుకుంది. మాటిచ్చాం.. కులగణన చేశాం.. ఇక కేంద్రానిదే బాధ్యత అంటూ కాంగ్రెస్.. చట్టం చేసి అమలు చేసుకోవచ్చని బీజేపీ పరస్పరం నెపాన్ని మోపుకుంటున్నాయి. శాస్త్రీయ అధ్యయన నివేదికలు లేకుండా రిజర్వేషన్ల కల్పన అసాధ్యం. ఇక జనాభా గణాంకాల సేకరణ కేంద్రం పరిధిలోని అంశం. కానీ దశాబ్దాలుగా దేశాన్ని ఏలుతున్న జాతీయ పార్టీలు ఆ స్ఫూర్తికి తిలోదకాలిచ్చాయి. ఇప్పటికీ కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉపాధి స్థితిగతులపై ఎలాంటి లెక్కలను సేకరించకుండా, వెనకబాటుతనాన్ని నిర్ధారించకుండా జనాభా ఆధారంగానే రిజర్వేషన్లను అమలు చేయడం ఒక వైచిత్రి. ఈ అశాస్త్రీయ, అసంబద్ధమైన విధానాల వల్లే రిజర్వేషన్ల అంశం నేడు రచ్చగా మారుతున్నది.

సహేతుకమైన గణాంకాలు అందుబాటులో లేకపోవడం వల్లే ఓబీసీల రిజర్వేషన్లు న్యాయసమీక్ష ఎదుట వీగిపోతున్నాయి. రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు నేడు అనేక ఆంక్షలు, షరతులను విధించాల్సి రావడమేగాక, అనుసరించాల్సిన నియమ నిబంధనలను జారీచేయాల్సిన అగత్యం ఏర్పడిందంటే ఏలికల తీరు అర్థం చేసుకోవచ్చు.


> కాంగ్రెస్ అంటేనే భూస్వాముల, పెత్తందారుల పార్టీ. అధికారం కోసం దేశంలో కుల, వర్గ వైషమ్యాలను పెంచి పోషించింది కాంగ్రెస్సే. హస్తం పార్టీ ప్రవచించే సామాజిక న్యాయం నోటిమాటలే తప్ప 60 ఏండ్ల ఆచరణలో ఎక్కడా కనిపించదు. ఓబీసీల పోరాటాల ఫలితంగా ఎట్టకేలకు యూపీఏ ప్రభుత్వం తలవంచి 2011లో సామాజిక, ఆర్థిక కులగణన చేయించింది. కానీ, సాంకేతిక కారణాలను సాకుగా చూపి ఆ నివేదికను తొక్కిపెట్టింది.

మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ అగ్రనాయకత్వం కులగణన, సామాజికన్యాయం అంటూ ఊదరగొడుతున్నది. తెలంగాణ మోడల్ అంటూ గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఢంకా బజాయిస్తున్నది. మరి ఆచరణ తీరు ఏమైనా మారిందా? అంటే శూన్యమనే చెప్పాలి. ప్రతీ పార్లమెంట్ సెగ్మెంట్‌లో 2 సీట్లను బీసీలకు కేటాయిస్తామని ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను అట్టహాసంగా ప్రకటించి, అమలును అటకెక్కించింది. అధికారంలోకి వచ్చిన అనంతరం క్యాబినెట్ విస్తరణలో, నామినేటెడ్ పోస్టుల భర్తీలో, ఉన్నతాధికారుల నియామకంలో ఇలా అడుగడుగునా ఓబీసీలకు మొండిచేయి చూపుతున్న తీరే కాంగ్రెస్ ధోకా రాజకీయాలకు దర్పణం. ఇక ఇటీవల తెలంగాణలో నిర్వహించిన కులగణన మరీ ఘోరం. 1.13 శాతం మాత్రమే తప్పులు దొర్లాయని 2011 కులగణన నివేదికను తొక్కిపెట్టిన కాంగ్రెస్ పార్టీనే.. ఇప్పుడు రాష్ట్రంలో 3.6 శాతం మంది ప్రజల గణాంకాలు సేకరించకుండా, అదే ప్రామాణికమని ప్రవచించడం శోచనీయం. తులనాత్మక అధ్యయనాలు సాగించకుండా, కమిషన్ల నివేదికలు బయటపెట్టకుండా, కులాలవారీ లెక్కలు తేల్చకుండా, అసెంబ్లీలో బిల్లులను పెట్టి చేతులు దులుపుకొన్నది. ఎందుకంటే కాంగ్రెస్ కులగణన నినాదం రాజకీయ అవసరాల కోసమే అన్నది సుస్పష్టం.



'అట్టడుగు వర్గాలకు ఏ రూపంలోనూ రిజర్వేషన్లు ఉండకూడదు. నిచ్చెనమెట్ల కులవ్యవస్థ యథాతథంగా కొనసాగాలి..' ఇదీ క్లుప్తంగా బీజేపీ సిద్ధాంతం. మండల్ కమిషన్ మొదలు గడిచిన పదేండ్లుగా బీజేపీ సాగిస్తున్న పాలనా విధానాలే అందుకు నిదర్శనం. 2014లో అధికారంలోకి వస్తే యూపీఏ ప్రభుత్వం 2011లో చేయించిన కులగణన లెక్కలు ప్రకటిస్తామని బీజేపీ చెప్పింది. కానీ, గడచిన పదేండ్లలో ఆ పని చేయలేదు. పైగా నివేదికను బహిర్గతం చేస్తే సామాజిక అసమానతలకు దారితీస్తుందని కొత్త భాష్యాన్ని ప్రచారంలోకి తీసుకురావడం బీజేపీ నయవంచనకు నిదర్శనం. జనగణనలోనే కులగణనను చేపడతామని 2018లో అప్పటి హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రకటించారు. కులగణన చేపట్టాలని 'ఓబీసీ పార్లమెంటరీ స్థాయి సంఘం' సిఫారసు చేసింది. కానీ ఆ హామీని, సిఫారసులనూ కేంద్రం మరోసారి బుట్టదాఖలు చేసింది. తెలంగాణ సహా ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు కులగణన చేపట్టాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపినా బీజేపీ పట్టించుకున్నదీ లేదు.

వర్గస్వభావ రీత్యా.. వెనకబడిన వర్గాల ప్రయోజనాలను వ్యతిరేకించడంలో బీజేపీ, కాంగ్రెస్‌లది ఒకే విధానం. ఓబీసీలను, ఎస్సీలను, ఎస్టీలను వంచించడంలో దొందూదొందే. రాజ్యాధికారాన్ని సుస్థిరం చేసుకునే ఎత్తులే తప్ప బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారాన్ని అప్పగించే యోచనే వాటికి లేదనేది సత్యం. ఆ రెండు జాతీయ పార్టీలు ఆడుతున్న రాజకీయ క్రీడలో పావులుగా మిగులుతున్నది.. దశాబ్దాలుగా దగా పడుతున్నది ఓబీసీలే. జాతీయ పార్టీల అలాంటి విధానాల ఫలితంగా ఓబీసీ వర్గాలు ప్రాంతీయ పార్టీలకు పట్టుకొమ్మలై నిలిచాయి. ప్రాంతీయ పార్టీలు సైతం ఓబీసీ వర్గాలకు పెద్దపీట వేశాయి. ఇకనైనా బీసీ సంఘాలు సత్యాన్ని గ్రహించాలి. జాతీయపార్టీలతో అంటకాగడం మానాలి. ఏకతాటిపై నిలబడాలి. అవకాశాలను అందివ్వగల, అభ్యున్నతికి బాటలు వేస్తున్న, హక్కుల సాధనకు బీసీలకు బాసటగా నిలుస్తున్న, గొంతు కలుపుతున్న నూతన శక్తులతో ఏకం కావాలె. అదే జాతీయపార్టీల వంచనను ఢీకొట్టే పాశుపతాస్త్రం, దశాబ్దాల ఆకాంక్షల సాకారానికి అనుసరణీయ మార్గం. ■




## అదే జరిగితే మోదీ పప్పులు ఉడకవు!



కులగణన అనేది జాతీయ స్థాయిలో జరగాల్సిన ప్రక్రియ. బీజేపీ సర్కారు, ప్రధాని మోదీ కులగణన చేయరు. ఎందుకంటే వారు అందుకు పూర్తి విరుద్ధం. ఒకవేళ కులగణన జరిగి దేశ వాస్తవ ముఖచిత్రం తెరపైకి వస్తే.. వాళ్లు చేసే మత రాజకీయాలకు శాశ్వతంగా తెరపడుతుంది.

**- తేజస్వీ యాదవ్, ఆర్జేడీ నేత**